# సమాజపు సంకెళ్లు

సంధ్యాదేవి దినకరుని తన వడిలోకి ఆహ్వానిస్తున్న సమయం! ఆకాశం తెల్లజరీ అంచువున్న నీలం చీరె కట్టుకొన్నట్టు వుంది. తోటలో నుండి మందంగా వస్తున్న గాలి ఆహ్లాదంగా వుంది. దూరంగా వున్న సంపెంగ పొదనుండి సువాసనలు వ్యాపిస్తున్నాయి. అయినా...

అంత ప్రశాంత వాతావరణంలోనూ..... నిరువమ కుర్చీలో నుండి లేచి తోటంతా ఒకసారి తిరిగి వచ్చింది. చేతులు వెనక్కు పెట్టుకొని తలవంచుకొని ఆలోచిస్తూ మరో పావుగంట పచార్లు చేసింది.

ఆ తర్వాత ఆలోచనలతో వేడెక్కిన తలను విదిలించుకొని కుర్చీలో కూర్చుని వెనక్కువాలి రిలాక్స్ కావటాని కన్నట్లు కళ్లుమూసుకొంది.

"అమ్మా"

"ఊ"

"మీరు అదోలా వున్నారు?"

నిరువమ తలయెత్తి లక్ష్మిని చూసింది. పదహారు సంవత్సరాల లక్ష్మి చూడటానికి అందంగా వుంటుంది.



ప్రశాంతంగా కూర్చోలేకపోతోంది. సాధారణంగా తీరిక వేళల్లో అక్కడే కూర్చుంటుంది. అది ఆమె కెంతో యిష్టం! కాని ఈ రోజు ఉదయం కాల్పులతో గాయపడ్డ ఆ తీవ్రవాది కుర్రవాడిని చూసినప్పటినుండి ఆమె చాల మథనపడుతోంది. ఎంత సమాధానపరచుకొందా మనుకున్నా మనసు దిటవు చేసుకోలేక పోతోంది.

"అమ్మా టీ చల్లారిపోతోంది." మూడోసారి గుర్తు చేసింది లక్ష్మి కొంచెం పెద్దగొంతుతో.

అప్పుడు కళ్లు తెరిచింది నిరువమ.

లక్ష్మి యెదురుగా భయపడుతున్నట్లు నిలుచుంది. నిరువమ కళ్లెత్తి లక్ష్మి ముఖంలోకి చూసింది.

అందరూ ఆమెను నిరువమ బంధువు అనుకొంటారు. వాళ్ళిద్దరి మధ్య వున్న అనుబంధమూ... ఆప్యాయతా మాటల్లో చెప్పలేనిది.

ఆరేళ్ల క్రితం ఒక వృద్ధుడు అనాథ అంటూ లక్ష్మిని ఆమె దగ్గరకు తీసుకు వచ్చాడు. "అమ్మా యింత ముద్ద పడేస్తే తింటుంది. మీ కాళ్ల దగ్గర పడుంటుంది.

చెప్పిన పని చేస్తుంది. బాగా బ్రతికిన పిల్ల! తల్లి దండ్రులు యాక్సిడెంట్‌లో పోవటంతో అనాధ అయ్యింది.'' అంటూ బ్రతిమలాడాడు.

ఆ సమయంలో నిరుపమకూ తోడుగా యెవరైనా వుంటే బాగుండు ననిపించింది. అందుకే లక్ష్మిని తన దగ్గరే వుంచేసుకొంది. నిరుపమ అవసరాన్ని కనిపెడు తుంది లక్ష్మి. నిరుపమను యెంతో అభిమానంగా.... ఆరాధనగా చూస్తుంది లక్ష్మి.

లక్ష్మి ఇంటి పనులలో చురుకుగా వుండటమే కాదు చదువులో కూడా ఫస్టువచ్చేది. ఈ సంవత్సరం కాలేజీలో చేరింది.

''లక్ష్మీ, ఈ టైమ్‌లో నువ్వు చదువుకోవాలి. అవునా?''

''అవును.''

''మరి టీ నువ్వెందుకు తేవాలి? నిన్ను చూస్తుంటే చాలాసేపటినుండి యిక్కడే వున్నట్లున్నావు. యామ్ ఐరైట్?''

అవునన్నట్లు తలవూపింది.

''వెళ్లి చదువుకో.''

''టీ....''

తలయెత్తిన నిరుపమ నిశితంగా అప్పుడు చూసింది లక్ష్మిని. లక్ష్మి కళ్లు నీటి కుండల్లా వున్నాయి. ''లక్ష్మీ'' ఆప్యాయంగా దగ్గరకు తీసికొంది నిరుపమ. ఆమె భుజంపై తలవాల్చిన లక్ష్మి దుఃఖం ఆపుకోలేక పోయింది. నిరుపమక్కూడా కళ్లనీళ్లు తిరిగాయి. అయినా ఆపుకొంది.

''ఎందుకు అలా బాధపడుతున్నావు చెప్పమ్మా. కాలేజీలో యేదైనా గొడవైందా?''

''లేదు''.

''మరి..'' అనునయంగా ఆమె భుజం తడుతూ అడిగింది.

''మీరు...మీరు... చాల బాధపడుతున్నారు.'' చెప్ప లేక ఆగి ఆగి చెప్పింది లక్ష్మి. నిరుపమ ఒక్క క్షణం నిశ్చేష్ఠ అయింది. ఈ పిల్ల... అనాధగా బేల చూపులు చూస్తూ తన దగ్గరకు వచ్చిన ఈ పిల్ల... తనను యింత నిశితంగా కనిపెట్టి చూస్తోందా?

ఏనాటిదీ అనుబంధం!

— అక్కల సరస్వతి బాబూరావు

తర్వాత తనను తాను సంబాళించుకొంది.

''చూడమ్మా లక్ష్మి నా ఉద్యోగం ఎలాంటిదో నీకు తెలుసు. నా ఉద్యోగంలోని సమస్యలూ... అవి యెదు ర్కోటం...''

లక్ష్మి కళ్లు తుడిచింది.

'ఈ రోజు నక్సలైట్లపై దాడి జరిగింది. అందులో ఒక కుర్రవాడు బాగా గాయపడి దొరికిపోయాడు. అతడు హాస్పటల్లో చావుబ్రతుకుల మధ్యనఉన్నాడు. అతడి గురించి ఆలోచిస్తున్నాను. దట్సాల్ మై చైల్డ్. వెళ్లి చదువుకో' పెదిమలపైకి నవ్వు తెచ్చుకొంటూ అంది.

''మీకు వేడి టీ తెస్తాను.''

ఆ సమయంలో నిరుపమకు వేడి టీ కావాలని లక్ష్మికి తెలుసు.

* * * * *

ఆరు నెలల క్రితం.

ఉదయం ఏడు గంటలకు ఆ ఊళ్లో ఆగిన బస్ నుండి అందరితో పాటు దిగుతున్న ఒక యువతి ఆబస్ స్టాప్‌లో అందర్నీ ఆకర్షించింది. ఆమెవైపు చూడని వారు లేరు. అందుకు కారణం...

సింపుల్‌గా వున్నా ఆమె అందంగా వుండటం!

కొట్టొచ్చినట్లు కనబడే ఆముఖంలోని కళ!

రోడ్డు మీది వాహనాలు తప్పించు కొంటూ భుజానికి సంచీ, చేతిలో వి.ఐ.పి. సూట్‌కేస్‌తో ఆమె రోడ్డును దాటి యిటువైపు వచ్చింది.

అది పెద్ద హొటలు గాక పోయినా చూడ్డానికి బాగానే వుంది. ఆడ వాళ్లు యెక్కువగా లేరు. బస్ దిగిన వాళ్లంతా అందులోకే వెళ్తున్నారు. నిరుపమకు ప్రొద్దుటినుండి కాఫీ పడలేదు. ముందు కాఫీ సంగతి చూద్దామని ఆ హొటల్లోకి వెళ్లి ఒక ప్రక్కగా యిద్దరు ఆడవాళ్లున్న బల్ల దగ్గర కూర్చుంది. ఎదురుగా వున్న అమ్మాయి, రెండు నిమిషాలు కన్నార్పకుండా నిరుపమ ను. చూసి అంది.

''మేడమ్, మీరు చాల అందంగా వున్నారు'' ఆమె చొరవకు ఆశ్చర్యపోయినా మర్యాదగా చిరునవ్వుతో ''థాంక్యూ'' అంది.

''మీరూ యిప్పుడే క్రొత్తగా వచ్చారా?'' అడిగింది నిరుపమ.

''అవునండీ. ఇక్కడ... ఆఫీసులో ఉద్యోగం వచ్చింది. జాయిన్ కావాలని వచ్చాను. అమ్మా, నాన్నాలేరు. వాళ్లె వరైనా వుంటే ఇల్లు అదీ చూసి పెట్టి వెళ్లేవాళ్లు. ఇది అసలే మంచి ప్రదేశం కాదు. నాకు భయంగా వుందండీ.'' చాల చనువుగా తన మనసులోని బాధను ఆత్మీయులకు చెప్పినట్లు చెప్పింది.

నవ్వింది నిరుపమ.

సర్వరు వేడియిడ్లీ యిద్దరకూ యిచ్చివెళ్లాడు.

''మీకు యిక్కడ బంధువులు వున్నారా?'' అడిగింది ఆ అమ్మాయి.

''లేరమ్మా. నేనూ ఉద్యోగ రీత్యా వంటరిగా వచ్చాను.''

''మరి ఈ క్రొత్త ఊరు రావటం... మీకేమీ భయంగా లేదా?''

''ఉహూ'' మళ్లీ నవ్వింది నిరుపమ.

''సారీ. మిమ్మల్ని విసిగిస్తున్నానేమో.''

''నో''

''నాపేరు ఉమ.''

''ఉమ అంటే పార్వతి.. ఆదిశక్తి. గుడ్. అయినా నువ్వు భయపడుతున్నావు.''

''పేరులో యేముందండీ''

''భయపడటంలో కూడా యేమీలేదు. బిబ్రేవ్.''

''మీపే...''

నిరుపమ''

''అబ్బ ఎంత మంచిపేరు!''

కాఫీలు త్రాగటం పూర్తి అయింది.

''అది సరే ఇప్పుడు యెక్కడి కెళ్తావు?'' అడిగింది ఉమను.

''అదే తెలియటం లేదు.'' బెదురుగా చూస్తూ అంది ఉమ.

''మనకి ధైర్యం వుండాలి. ఆడవాళ్లైనంత మాత్రాన ప్రతి దానికి భయపడకూడదు. ప్రతి పనిని ఆలోచించి చేయటం అలవర్చుకోవాలి.''

''మిమ్మల్ని చూస్తుంటే చాల తెలివిగల వాళ్లలా వున్నారు.''

''థాంక్యూ. అది సరే యిప్పుడు నేను రెండు మూడు రోజులు నీకు ఆశ్రయం యివ్వగలను. నాతో రా.''

''మీకెవరూ లేరన్నారు.''

''ఎవరూ లేక పోయినా ఎక్కడో ఒకచోట వుండాలి గదా. ఏ హొటల్లోనో..''

''అమ్మో మనిద్దరం హొటల్లో వంటరిగా...''

''నన్ను నమ్మగలిగితే నాతోరా నేవెళ్తున్నా ఇక నీయిష్టం.'' అంటూ లేచింది నిరుపమ. ఉమ యింకా ఆలోచిస్తోంది.

కౌంటర్లో డబ్బు యివ్వటానికి రెండడుగులు వేసిన నిరుపమ అలాగే నిలబడింది.

అక్కడ...

ఒక పహిల్వాన్ లాటి మనిషి హొటలు యజమా నిని యిష్టం వచ్చినట్లు తిడుతున్నాడు. పాపం! హొ టలు యజమాని భయపడుతూ యేదో చెపుతున్నాడు.

నిరుపమ ప్రక్కకు చూసింది.

ఆ ఊరి వాళ్లే యిద్దరు అక్కడ వుంటే వారిప్రక్కనే కూర్చుంటూ అడిగింది.

''ఏమిటండీ ఆ గొడవ?''

''వాడొక రౌడీ. రోజూ డబ్బుయివ్వకుండా వాడు తినేది కాకుండా పదిమందికి పెట్టిస్తాడు.''

''ఎంతైనా బిజినెస్ కదండీ. కావాలంటే నువ్వెంతైనా తిను. పెడతాను. అందరికీ పెట్టించి నన్ను దివాలా తీయించకు. అని అతడిగోల.''

''ఏం చేస్తాడు అతడు?'' అడిగింది నిరుపమ.

''రోడ్లు సర్వే చేస్తాడు.'' రెండో అతను చెప్పాడు.

''పనీపాటా లేదన్న మాట.'' అంది నిరుపమ.

''పని యెందుకండీ. తాతలు సంపాదించి పోశారు. వీడు డబ్బు యివ్వలేక కాదు. రౌడీయిజం. అంతే.''

''ఓ'' అంటూ లేచింది నిరుపమ.

అందమైన అమ్మాయి అలా వాళ్లతో మాట్లాడటంతో యిద్దరూ ఆనందంగా వున్నదున్నట్లు చెప్పారు.

నిరుపమ డబ్బు యివ్వటానికి కౌంటర్ దగ్గరకు వెళ్లింది.

నిరుపమ అందిస్తున్న పది రూపాయల నోటు ఆరౌడీ అందుకొన్నాడు. ''నే నిచ్చింది హొటలు బిల్లు. అతడి కివ్వండి.'' మర్యాదగా అంది.

''తెలుసులే. అంది మా బేరం!'' అన్నాడతడు. ఆ అనటంలో వాడి ధీమా తెలుస్తోంది.

''ఇదిగో ప్రొప్రయిటరూ. మళ్లీ మాట్లాడావా ఇదే నీగతి. కస్టమర్స్ డబ్బు కూడా ఏనుకెళ్తా జాగ్రత్త!'' పది రూపాయల నోటు మడిచి జేబులో పెట్టుకొన్నాడు.

''ఇదుగో మిస్టర్. ఆ పది అతడి కివ్వమని చెపు తున్నాను. ఇవ్వు.''

ఆమె కంఠంలోని కరకుదనానికి అక్కడి వాళ్లు ఉలిక్కిపడ్డారు.

"ఇవ్వనే ఏం చేస్తావ్?" చెయ్యెత్తాడు బెదిరించాలని!

అంతే! అతడి మాట పూర్తికాలేదు. అతడి చేయి ఆమెను తాకకుండా మధ్యలో ఎడంచేతితో అతడికుడి చేయి పట్టుకొని ఆపేసింది. ఆచేయి విడిపించుకోలేక పోతున్నాడు. వెంటనే కుడిచేతిని కత్తిలా పెట్టి మెడమీద ఒక్కటే దెబ్బవేసి క్రిందకు త్రోసింది.

వాడు స్పృహ తప్పాడు.

"వీడికి అరగంట వరకూ స్పృహరాదు. వాళ్ల వాళ్లకు కబురు చేయి తీసి కెళ్తారు."

చాలా మామూలుగా హొటల్‌యజమానితో చెప్పి ఉమవైపు తిరిగి "వస్తావా" అంది.

పది మంది కలిసినా యేం చేయలేని ఆ రౌడీని సుకుమారంగా సింపుల్‌గా కనిపిస్తున్న నిరుపమ అంత సునాయాసంగా తేలిగ్గా పడవేసి అతి మాములుగా వెళ్లిపోతుంటే అందరితో పాటు కళ్ళప్పగించి చూస్తున్న ఉమ గబగబ అమె ననుసరించింది.

* * *

వారం రోజులు గడిచేటప్పటికి ఊర్లో అందరికీ నిరుపమ ఆ ఊరికి క్రొత్తగా వచ్చిన పోలీస్ ఆఫీసరని తెలిసిపోయింది.

అంతేకాదు. ఆమె రాకతో ఊర్లోవున్న రౌడీల పార్టీలు బెదిరిపోయాయి. కొట్లాటలు అణగిపోయాయి.

వెన్ను విరుచుకొని తిరుగుతూ బజార్లో కొట్లమీద పడి దోచుకునే వాళ్లూ, ఒక్కొక్క ఏరియా మాదంటూ రాజ్యం యేలేవాళ్లూ... అందరూ అతి త్వరలో కటకటాల వెనక్కు వెళ్లారు.

నాయకులు లేక ముఠాలు మూలపడ్డాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ ఊరు చల్లబడింది!

కానీ...

ఆరు రోజుల క్రితం ఫోన్లో మాట్లాడుతూండగా దుఃఖంతో ఆమె కంఠం పూడుకుపోయింది.

నిరుపమకు ఉద్వేగంతో కన్నీరు తిరిగింది.

* * *

ఫోన్ రింగవుతుంటే తీసింది నిరుపమ.

"మేడమ్. ఆ కుర్రవాడు మరణించాడు. శవాన్ని మీరు తీసికెళ్ళొచ్చు."

"వస్తున్నాను." దుఃఖంతో గొంతు పూడుకుపోతుంటే ఫోను పెట్టేసింది.

ఆ శవాన్ని యెలా ఇంటికి చేర్చిందో ఆమెకి తెలియదు.

చుట్టు ప్రక్కల జనమంతా ఆకాంపౌండ్‌లో చేరారు. అందరికీ ఆశ్చర్యం కలిగించింది ఏమిటంటే — గంభీరంగా వుండే నిరుపమ... హుందాగా... ఠీవిగా కనిపించే నిరుపమ... అర్ధరాత్రిలో... నిర్జన ప్రదేశాల్లో ఒంటరిగా... నిర్భయంగా కారు తనే డ్రైవ్ చేసుకొంటూ తిరిగే నిరుపమ... ఎంతో ధైర్యంగా కనిపించే నిరుపమ ఈనాడు ఆ శవంపై పడి హృదయవిదారకరంగా యేడ్వటం!

ఎవరికీ యేమీ తోచటంలేదు.

డిపార్ట్‌మెంట్ వాళ్లు అక్కడ వున్నా యేమీ అడగలేక పోతున్నారు.

నిరుపమ యెందుకు యేడుస్తుందో తెలియని లక్ష్మి తానూ దుఃఖం ఆపుకోలేక పోతోంది.

సరిగ్గా అప్పుడే ఆయింట్లోకి వచ్చింది ఉమ. అక్కడి పరిస్థితి చూసి దిగ్భ్రాంతి చెందింది. తర్వాత నిరుపమ భుజంపై చేయివేసి తనవైపు త్రిప్పుకొంటూ అంది.


"మేడమ్. ఏమిటిలా అయిపోయారు? మీ డ్యూటీ మీరు చేశారు. పోయిన ఆ అనామకుడి కోసం మీరింతగా దుఃఖించటం బాగాలేదు. ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్" ఆమె కళ్లు తుడుస్తూ అంది. "వాడు అనామకుడు కాదు ఉమా. హి ఈజ్ మై సన్."

అక్కడున్న వారంతా ఒక్కక్షణం స్థాణువులే అయ్యారు. అందంగా, సుకుమారంగా కనిపిస్తున్న ఈ పద్దెనిమిది సంవత్సరాల కుర్రవాడు తీవ్రవాదిగా పట్టుబడ్డాడు. పారిపోతున్న అతడిని కాల్చింది నిరుపమే!

ఆ తర్వాత నిరుపమ అక్క లాయర్ అనుపమ వచ్చి నిరుపమను బుజ్జగించి ఓదార్చింది. అటుతర్వాత జరుగవలసిన వన్నీ జరిపింది. వాళ్లతో బాటు ఉమ అక్కడే వుండిపోయింది.

* * *

"నీరూ నేను వచ్చి చాల రోజులైంది. ఇక వెళ్లాలనుకొంటున్నాను. నీకేం చెప్పాలో ఎలా చెప్పాలో నాకేమీ తోచటం లేదు. కారణం... నువ్వే యెన్నో విషయాల్లో నాకు సలహాలు యిచ్చేదానివి. నీరూ నువ్విలా శెలవు పెట్టి బాధపడుతూ కూర్చుని చేయగలిగిందేమీలేదు.



బియ్యం పురుగుపట్టకుండా వుండాలంటే, తేగానే తవుడు, పొట్టు లేకుండా సన్నమూకలు తీసి వెయ్యండి. పురుగు పట్టదు.

డ్యూటీలో జాయిన్ అయి మనసును మరల్చుకో." అంది అనుపమ "నేనూ అదే అనుకొంటున్నాను అక్కా. కాని... ఈ సంఘటన యెలా మరిచిపోవాలో తెలియటం లేదు." ఆమె కొంచెం ఆగి మళ్లీ అంది. "అక్కా చాలా రోజుల నుండి నేనొక అశతో బ్రతుకుతున్నాను. అది యేమిటో తెలుసా? ఏదో ఒక రోజు నాకొడుకు కనిపిస్తాడనీ. వాడు యెక్కడ వున్నా యెవరి దగ్గర వున్నా 'నువ్వు నాబిడ్డవురా' అని చెప్పి నా దగ్గరే వుంచేసుకొని యిన్ని సంవత్సరాల ప్రేమను వాడికి అందించాలని... వాడినెంతో చదివించి ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాలని దేశానికి వాడు గర్వకారణం కావాలని అనుకొన్నాను. కాని అక్కావాడు ఈ రకంగా... నాకు కనిపించి..." మాట పూర్తి చేయలేక యేడ్చేసింది నిరుపమ.

ఉమ ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసికొంది. అనుపమ ఆమె భుజంపై మెల్లగా తట్టింది ఊరడిస్తున్నట్లు.

చాలాసేపటి వరకు యెవరూ మాట్లాడలేదు.

"మేడమ్ మీరు మరోలా భావించనంటే ఒక విషయం అడగాలని వుంది." చివరకు ఉమే మాట్లాడింది.

"నువ్వేం అడుగుతావో నాకు తెలుసు ఉమా చనిపోయిన నా కొడుకు గురించే కదా! విను" అంది.

* * *

పదహారు సంవత్సరాల నిరుపమను అందం, ఐశ్వర్యం వున్న రఘు ఆకర్షించాడు. అదే ప్రేమ అనుకొన్నారు. చెట్టా పట్టాలేసుకొని తిరిగారు. పెళ్లికి ప్రమాణాలూ చేసుకొన్నారు.

నిరుపమ తల్లి కాబోతున్నదని తెలిసినప్పుడు ఆమె తండ్రి రఘురాం యింటికి వెళ్లి అతడి తండ్రిని నిరుపమను కోడలిగా చేసికోమని ప్రాధేయపడ్డాడు. కాని... అతడు అతనికి డబ్బు యిచ్చి "మీ అమ్మాయి పెళ్ళి చేసెయ్." అన్నాడు నిర్లక్ష్యంగా.

డబ్బు అక్కడే వదిలేసి యింటికొచ్చి జరిగింది చెప్పాడు. ఇంట్లో తలిదండ్రులు గాని. అక్కగాని ఈ విషయంలో ఒక్కమాట అనకుండా జాగ్రత్తగా చూడటం నిరుపమకు మరీ కష్టం అనిపించింది.

ఆ తర్వాత నిరుపమను మరో ఊరు తీసికెళ్లి పురుడు పోశారు. ఆమెకు చక్కటి కొడుకు పుట్టాడు. కానీ... ఆమె కంటి బిడ్డను చూసుకోకుండానే మగతలో వుండగానే తండ్రి ఆబిడ్డను మాయం చేశాడు. చాలా రోజుల తర్వాత తన కొడుకును అనాధ శరణాలయానికి యిచ్చినట్లు ఆమెకు తెలిసింది. అప్పుడామె యెంతగోల పెట్టినా లాభంలేక పోయింది.

తర్వాత తండ్రి ఆమెకు వివాహం చేయాలని చాలా ప్రయత్నించాడు. నిరుపమ అంగీకరించలేదు. రెండేళ్లకే తల్లిదండ్రులకు దూరమయ్యారు ఆ అక్కచెల్లెళ్లు!

ఆ అడవుల్లో తీవ్రవాదులు స్థావరం యేర్పరచుకొని వుంటున్నారని, ఊర్లు కొల్లగొడుతున్నారని నిరుపమను అక్కడ డ్యూటీకి వేశారు.

రెండు మూడు సార్లు ప్రయత్నించినా యెవరూ దొరకలేదు నిరుపమకు.

ఆఖరుసారి కాల్పులు జరిపినప్పుడు దెబ్బలు తగిలిన ఒక కుర్రవాడు దొరికి పోయాడు. బోర్లాపడివున్న అతడిని యెత్తి వేన్లో వేస్తుండగా చూసింది అతడి ముఖాన్ని.

ఒక్కసారి గుండె ఆగినట్లయింది!

ఏనాడో పుట్టగానే తననుండి వేరు చేయబడ్డ బిడ్డ అతడేనని గుర్తించింది. ఒకటి అతడు రఘుపోలికలతో వుండటం... రెండు పుట్టగానే తను చూసిన గడ్డం మీద పెద్దపుట్టు మచ్చ!

గతం విన్న ఉమ అంది.

"జరిగిందేదో జరిగింది. ఇకనైనా మీరు మనుష్యుల్లో పడాలి. మీవల్ల ప్రజలకు యెంతో అవసరం వుంది. అది గుర్తుంచుకోండి. నేను మీకు చెప్పతగిన దాన్ని కాదు."

"అది కాదు ఉమా. ఈ నాటి ధైర్యం, తెగింపు ఆనాడు నాకు ఎందుకు లేకపోయిందా అని బాధపడుతున్నాను."

"అప్పుడు నీ వయసు చాల తక్కువ." అనుపమ అంది.

"కావచ్చు. కాని అక్కా! కనీసం నాన్నగారు నన్ను క్షమించినట్లే ఈ సమాజానికి కూడా భయపడకుండా వుండి వుంటే... నా బిడ్డను నేను పెంచుకొనే దాన్ని పరువు మర్యాద అంటూ వెనుకాడక పోతే ఆ రఘును కోర్టుకు ఈడ్పించే వాళ్లం! కాని... యేదీ చేయలేక పోయాం! ఎందుకు? ఈ సమాజానికి భయపడి! అక్కా ఏనాడు ఈసమాజపు సంకెళ్లు బ్రద్దలు కొట్టి స్త్రీలు తమకు న్యాయం చేకూర్చుకో గలరు?" అంది ఉద్రేకంగా.

ఇది సమాధానంలేని ప్రశ్నేనా?!